క్లుప్తంగా

దేవినేనిని కలిసిన తిరువూరు నాయకులు



తిరువూరు: వైఎస్సార్ సీపీ జిల్లా కమిటీలో ఇటీవల నియమితులైన తిరువూరు మండల నాయకులు శనివారం పార్టీ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్‌ను విజయవాడలోని పార్టీ కార్యాలయంలో కలిశారు. తమను జిల్లా కమిటీలో నియమించినందుకు అవినాష్‌కు వారు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు యరమల రామచంద్రారెడ్డి, కలకొండ రవికుమార్, మండల అధ్యక్షుడు తాళ్లూరి నవీన్‌కుమార్, లీగల్ సెల్ కన్వీనర్ రేగళ్ల మోహన్‌రెడ్డి తదితరులు అవినాష్‌ను కలిసిన వారిలో ఉన్నారు.

మజ్జిగ, పులిహోర పంపిణీ

మైలవరం: వెల్వడంలో లకిరెడ్డి పాపులమ్మ మెమోరియల్ జెడ్పీ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల సంఘం సహకారంతో ఏర్పాటు చేసిన చలివేంద్రంలో శనివారం మజ్జిగ, పులిహోర పంపిణీ చేశారు. ప్రవాసాంధ్రులు విజయకృష్ణ, సుధీర్‌రెడ్డి సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థి సంఘం నాయకుడు గూడూరు నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డ్ ప్రిన్సిపాల్‌కు ప్రతాప్ నివాళి



నూజివీడు: పట్టణంలోని ఎస్‌డీపీ స్కూల్ రిటైర్డ్ ప్రిన్సిపాల్, పాస్టర్ పల్లె వరప్రసాద్ (78) భౌతికకాయానికి మాజీ ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు శనివారం రాత్రి నివాళులర్పించారు. గత కొంతకాలంగా అస్వస్థతతో బాధపడుతున్న వరప్రసాద్ మృతిచెందారు. ఈయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. వరప్రసాద్ భౌతికకాయంపై ప్రతాప్ పూలమాల వేసి నివాళులర్పించారు. నాయకులు పిళ్లా చరణ్, కళ్లేపల్లి ఆదినారాయణ, ఉదయగిరి కృపారావు, కలపాల కృపారావు, గంటా పోలు, సర్పంచి బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

నూతన ఆవిష్కరణలతో ఉజ్వల భవిష్యత్

కేతనకొండ(ఇబ్రహీంపట్నం): విద్యార్థులు చేపట్టే నూతన ఆవిష్కరణలతో భవిష్యత్ బంగారు బాటగా నిలుస్తుందని ఆర్కే కళాశాల ప్రిన్సిపాల్ కె. రామకృష్ణయ్య తెలిపారు. కేతనకొండ ఆర్కే ఇంజినీరింగ్ కళాశాలలో టెక్నార్క్ 2కే 25 జాతీయ స్థాయి టెక్ ఫెస్ట్ శనివారం నిర్వహించారు. సుమారు 200 మంది విద్యార్థులు పాల్గొని వివిధ రకాల ప్రజెంటేషన్స్, ప్రాజెక్ట్ ఎక్స్‌పోలతో వారి ప్రతిభ చాటారు. ప్రిన్సిపాల్ రామకృష్ణయ్య మాట్లాడుతూ ఇంజినీరింగ్ దశలో నైపుణ్యం ప్రదర్శించేందుకు ఇటువంటి ఎక్స్‌పోలు దోహదపడతాయన్నారు. వివిధ రకాల ప్రాజెక్టులతో విజేతలుగా నిలిచిన వారికి సర్టిఫికెట్లు, బహుమతులు అందజేశారు. వైస్ ప్రిన్సిపాల్ సాయిరామ్, విభాగాధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

25న జాబ్‌మేళా

తిరువూరు: తిరువూరులో జాబ్‌మేళా కార్యక్రమం ఈ నెల 25న జరుగుతుందని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎం. సుశీలరావు తెలిపారు. డైకిన్ ఎయిర్ కండీషనింగ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, పానాసోనిక్ లైఫ్ సొల్యూషన్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, కేఎల్ గ్రూప్‌లలో 390 ఉద్యోగాలను ఈ మేళాలో భర్తీ చేస్తారన్నారు. పదో తరగతి, ఇంటర్, డిగ్రీ అర్హతలు కలిగిన నిరుద్యోగ అభ్యర్థులు ఈ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

విద్యతోనే ఉన్నతి

మైలవరం: ఎస్సీలు, బలహీన వర్గాల విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు కోట డానియేల్ అన్నారు. వర్గీకరణకు అసెంబ్లీలో ఆమోదం తెలపడంపై హర్షం వ్యక్తం చేస్తూ ఎమ్మార్పీఎస్ మహాజన సోషలిస్ట్ పార్టీ ఆధ్వర్యంలో మైలవరంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రామ్, మంద కృష్ణ మాదిగ చిత్రపటాలకు శనివారం క్షీరాభిషేకం చేశారు. మైలవరం సర్పంచ్ జి. మంజుభార్గవి, తెలుగు యువత నాయకుడు లంకా లితీష్, నాగరాజు, కె. రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ హర్షణీయం

ఆగిరిపల్లి: ఎస్సీ వర్గీకరణ బిల్లు అసెంబ్లీలో ఆమోదం పొందడం హర్షణీయమని ఎమ్మార్పీఎస్ నాయకులు పేర్కొన్నారు. శనివారం మండలంలోని నరసింగపాలెంలో దళిత సంఘాల ఆధ్వర్యంలో మంద కృష్ణ మాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు నల్లమోతు కాంచనరావు, లామ్ రమేష్, విలియమ్స్, ముళ్ళపూడి వెంకటేశ్వరరావు, నీలంబరం రాము పాల్గొన్నారు.

సబ్సిడీ రుణ దరఖాస్తుల గడువు పెంపు

తిరువూరు: వివిధ కార్పొరేషన్ల ద్వారా సబ్సిడీ రుణాలకు దరఖాస్తు చేసుకునే గడువును ఈ నెల 25వ తేదీ వరకు పొడిగించామని తిరువూరు మండల పరిషత్ అభివృద్ధి అధికారి రవిబాబు తెలిపారు. స్వయం ఉపాధి పథకాల ద్వారా లబ్ధి పొందదలచిన నిరుద్యోగులు 21 నుంచి 60 సంవత్సరాలలోపు వయస్కులు బీసీ, ఈబీసీ, కమ్మ, రెడ్డి, ఆర్య వైశ్య, బ్రాహ్మణ, కాపు, క్షత్రియ కార్పొరేషన్ల ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు సమర్పించాలని కోరారు.

ఇరుకు గదులతో ఇబ్బందులు

- రెండు జెడ్పీ హైస్కూళ్లకు భవనాలు లేక అవస్థలు
- నత్తనడకన నిర్మాణం జరుగుతున్న కట్టుబడిపాలెం హైస్కూల్ భవనం
- ప్రైమరీ, హైస్కూల్ విద్య ఒకే చోట బోధన
- మౌలిక వసతులు కరువు



పనులు చివరి దశలో ఉన్న కట్టుబడిపాలెం జెడ్పీ హైస్కూల్ భవనం

జి.కొండూరు: పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యంగా గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేపట్టిన నాడు–నేడు కార్యక్రమానికి కూటమి ప్రభుత్వం తూట్లు పొడుస్తోంది. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన, భవనాల ఆధునికీకరణ, అదనపు గదుల నిర్మాణం, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో డిజిటల్ క్లాస్‌రూంలు వంటివి గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఏర్పాటు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ తొమ్మిది నెలల కాలంలో నాడు–నేడును కొనసాగించకపోగా నిర్మాణంలో ఉన్న భవనాలకు నిధులు సక్రమంగా మంజూరు చేయడం లేదు. దీనితో జి.కొండూరు మండల పరిధి కట్టుబడిపాలెం హైస్కూల్ నూతన భవన నిర్మాణం నత్తనడకన సాగుతుండగా.. చెవుటూరు జెడ్పీ హైస్కూల్ భవన నిర్మాణానికి స్థలం లేకపోవడంతో ప్రత్యేక భవన నిర్మాణం ప్రతిపాదనల దశలోనే ఉండిపోయింది.

అన్ని తరగతులు ఒకే చోట..

కట్టుబడిపాలెం, చెవుటూరు జెడ్పీ హైస్కూళ్లకు ప్రత్యేక భవనాలు లేక ప్రాథమిక, హైస్కూల్ విద్య ఒకే చోట బోధిస్తున్నారు. కనీస మౌలిక వసతులు లేక, తరగతి గదులు సరిపోక వరండాల్లోనే విద్యను బోధిస్తున్నారు. చదవేది అక్కడే, తినేది అక్కడే, ఆడేది అక్కడే అన్నట్లు కొద్దిపాటి స్థలంలోనే అన్నీ కానిచ్చేస్తున్నారు. అధికారులు స్పందించి కట్టుబడిపాలెం జెడ్పీ హైస్కూలు భవన నిర్మాణాన్ని వెంటనే పూర్తి చేయడంతో పాటు చెవుటూరు జెడ్పీ హైస్కూల్ భవన నిర్మాణానికి స్థలం కేటాయించి నిర్మాణం చేపట్టాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



కట్టుబడిపాలెం పాఠశాల భవనం

నత్తనడకన పనులు..

జి.కొండూరు మండల పరిధి కట్టుబడిపాలెం గ్రామంలో ప్రాథమిక పాఠశాల, జెడ్పీ హైస్కూళ్లకు భవనాలు విడివిడిగా లేకపోవడంతో ఒకే భవనంలో నిర్వహిస్తున్నారు. గత ప్రభుత్వంలో చివరి ఏడాది నాడు–నేడు కింద నిధులు కేటాయించడంతో జెడ్పీ హైస్కూల్ నూతన భవన నిర్మాణానికి బీజం పడింది. ఈ పాఠశాల భవనం నిర్మాణంలో భాగంగా రూ.1.96 కోట్లతో మూడు అంతస్తులతో 11 గదుల నిర్మాణ పనులు ప్రారంభించారు. అయితే గత ప్రభుత్వ హయాంలోనే 70 శాతం పనులు పూర్తయ్యాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పనులు నత్తనడకన సాగుతున్నాయి.

కట్టుబడిపాలెం, చెవుటూరు ప్రాథమిక, జెడ్పీ హైస్కూళ్ల వివరాలు

అంశం	కట్టుబడిపాలెం	చెవుటూరు
మొత్తం విద్యార్థులు	204	280
ప్రైమరీ విద్యార్థులు	37	65
ప్రైమరీ పాఠశాల ఉపాధ్యాయులు	02	04
హైస్కూలు విద్యార్థులు	167	215
హైస్కూలు ఉపాధ్యాయులు	11	11
తరగతి గదులు	09	11

మౌలిక వసతులు కరువు

కట్టుబడిపాలెం, చెవుటూరు గ్రామాల్లోని ప్రైమరీ, జెడ్పీ హైస్కూళ్లలో కనీస మౌలిక వసతులు కరువయ్యాయి. గత ప్రభుత్వ హయాంలో నాడు–నేడు కింద ఈ పాఠశాలలను ఆధునికీకరించినప్పటికీ హైస్కూళ్లకు ప్రత్యేక భవనాలు లేకపోవడంతో ఉపాధ్యాయులకు అవసరమైన ఆఫీసు గదులు, స్టాఫ్ గదులు, విద్యార్థులకు అవసరమైన లైబ్రరీలు, సైన్సు ల్యాబ్‌లు, స్పోర్ట్స్ గదులు, ప్లే గ్రౌండ్‌లు ఈ రెండు పాఠశాలల్లో అందుబాటులో లేవు. దీనితో పాఠశాల దశలో విద్యార్థులు పలు అంశాలపై అవగాహన కోల్పోతున్నారు.

భవన నిర్మాణం వెంటనే పూర్తి చేయాలి



హైస్కూలు భవన నిర్మాణం వెంటనే పూర్తి చేయాలి. గత ప్రభుత్వంలోనే నిర్మాణ పనులు 70 శాతానికి పైగా పూర్తయ్యాయి. ఈ తొమ్మిది నెలల్లో పది శాతం పనులు చేశారు. పిల్లలు ఇబ్బంది పడుతున్నారు. భవన నిర్మాణం వెంటనే పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలి.

– చెన్నూరు సాంబదుర్గారావు, విద్యార్థి తండ్రి, కట్టుబడిపాలెం

ఒక నెలలో అందుబాటులోకి వస్తుంది



కట్టుబడిపాలెం జెడ్పీ హైస్కూల్ నూతన భవనం ఒక నెలలో అందుబాటులోకి వస్తుంది. భవన నిర్మాణానికి నిధులు సరిపడా ఉన్నాయి. చెవుటూరు జెడ్పీ హైస్కూల్ భవనానికి స్థలం సమస్య ఉంది. స్థలం కోసం గ్రామంలో అందుబాటులో ఉన్న స్థలాలను పరిశీలిస్తున్నాం. త్వరలో స్థలాన్ని సేకరించి భవన నిర్మాణానికి ప్రతిపాదనలు పంపుతాం.

– ఎం.వీరాస్వామి, ఎంఈఓ–2, జి.కొండూరు

రైతులు నీటి కుంటలను తవ్వించుకోవాలి

ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్

జి.కొండూరు: రైతులు తమ వ్యవసాయ క్షేత్రాల్లో నీటి కుంటలను తవ్వించుకోవాలని, దీని ద్వారా సాగుకు అవసరమైన నీటిని నిల్వ చేసుకోవచ్చని ఎమ్మెల్యే వసంత వెంకటకృష్ణప్రసాద్ అన్నారు. ప్రపంచ జల దినోత్సవాన్ని పురస్కరించుకుని జి.కొండూరు మండల పరిధి ఆత్కూరు గ్రామానికి చెందిన రైతు కంఠమనేని శ్రీనివాసరావు వ్యవసాయ భూమిలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ నిధులు రూ.58 వేలతో ఏర్పాటు చేయనున్న నీటికుంటకు ఎమ్మెల్యే శనివారం భూమి పూజ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్టీఆర్ జిల్లాకు 2,713 నీటికుంటలు మంజూరైన నేపథ్యంలో రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎంపీపీ వేములకొండ లక్ష్మీతిరుపతమ్మ, అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

భూగర్భ జలాల పెరుగుదల..

మూలపాడు(ఇబ్రహీంపట్నం): భూగర్భ జలాల పెరుగుదలకు ఇంకుడు గుంటలు దోహదపడతాయని ఎంపీపీ పాలడుగు జోత్స్న అన్నారు. ప్రపంచ జల దినోత్సవం సందర్భంగా మూలపాడులో ఇంకుడు గుంతల తవ్వకం పనులను శనివారం ఆమె ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ ఇప్పటికే తగ్గుతున్న భూగర్భ జలాల పెరుగుదలకు ప్రభుత్వం ఇంకుడు గుంతల తవ్వకాలను ప్రారంభించిందని వివరించారు. కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.

గ్రామాల్లో అంతర్జాతీయ నీటి దినోత్సవం

తిరువూరురూరల్: మండలంలోని పలు గ్రామాల్లో శనివారం అంతర్జాతీయ నీటి దినోత్సవం నిర్వహించారు. తిరువూరు మండల పరిషత్ అధ్యక్షురాలు గద్దల భారతి మాట్లాడుతూ తాగునీరు, సాగునీరు వృధా చేయవద్దని, వేసవిలో నీటి సమస్య ఉత్పన్నం కాకుండా ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. ఆంజనేయపురంలో ఇంకుడు గుంటల తవ్వకాన్ని సర్పంచి మామిడి కుటుంబరావు, చిట్టేలలో సర్పంచి తుమ్మలపల్లి శ్రీనివాసరావు ప్రారంభించారు. నీటిని పొదుపుగా వాడుకోవాలని, ఇంటింటా ఇంకుడు గుంటలు ఏర్పాటు చేసి నీరు నిల్వ ఉండేవిధంగా చూడాలని వారు గ్రామస్తులకు సూచించారు. జెడ్పీటీసీ సభ్యుడు యరమల రామచంద్రారెడ్డి, ఎంపీడీఓ రవిబాబు, ఏపీఓ నల్లగట్ల మున్నీ తదితరులు పాల్గొన్నారు.



ఇంకుడు గుంట తవ్వకాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే



సూరేపల్లిలో ఇంకుడు గుంట తవ్వకానికి భూమిపూజ

సేద్యానికి మేలు..

ముసునూరు: పంట నీటి గుంటలతో భూగర్భ జలాలు మెరుగుపడి పంటలకు మేలు జరుగుతుందని ఎంపీడీఓ జి.రాణి అన్నారు. ప్రపంచ జల దినోత్సవం సందర్భంగా ఉపాధి హామీ ఏపీఓ రోజ్‌లీల ఆధ్వర్యంలో శనివారం పలు గ్రామాల్లో ఇంకుడు గుంటల ఆవశ్యకతపై రైతులకు అవగాహన కల్పించారు. పంట గుంటల తవ్వకాలకు భూమి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో భూగర్భ జలాలు రోజురోజుకు అడుగంటి పోతున్నాయని, దీని నివారణకు సాగునీటి కుంటలు, చెక్ డ్యాంలు, ఇంకుడు గుంటలు తవ్వి ప్రతి చుక్క నీటిని ఒడిసిపట్టడం ద్వారా సమస్యను అధిగమించాలని రైతులకు సూచించారు. కార్యక్రమాల్లో ఉపాధి హామీ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

సంస్కృతం పరీక్షకు 715 మంది హాజరు

నూజివీడు: పట్టణంలోని 8 పరీక్షా కేంద్రాల్లో శనివారం నిర్వహించిన పదో తరగతి సంస్కృతం పరీక్షకు 718 మంది విద్యార్థులకు గాను ముగ్గురు గైర్హాజరవ్వగా 715 మంది పరీక్షలు రాశారని డీవైఈఓ ఎం.సేవియా తెలిపారు. ఉదయం 9.30 గంటలకు ప్రారంభమైన పరీక్షలు 11.15 వరకు జరిగాయి. వేసవి దృష్ట్యా పరీక్షల్లో విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు చేశారు. ప్రతి పరీక్ష కేంద్రం వద్ద పోలీస్ సిబ్బందిని, వైద్య సిబ్బందిని నియమించారు.

100 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

నూజివీడు: మండలంలోని ఓగిరాల తండాలో శనివారం స్థానిక ఎక్సైజ్ సిబ్బంది చేసిన దాడుల్లో 100 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశామని నూజివీడు ఎక్సైజ్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎ. మస్తానయ్య తెలిపారు. గతంలో ముసునూరు మండలం చెక్కపల్లిలో ద్విచక్ర వాహనంపై 40 లీటర్ల సారాను తరలిస్తూ పారిపోయిన కేసులో నిందితుడైన చింతలపూడి మండలం నాగిరెడ్డిగూడెంకు చెందిన భూక్యా కిరణ్‌ను అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచామని చెప్పారు.

పాత నేరస్తుల అరెస్టు

తిరువూరు: సారా తయారీ, అమ్మకాలు జరుపుతున్న పాత నేరస్తులను తిరువూరు ఎక్సైజ్ అధికారులు శనివారం అరెస్టు చేశారు. విస్సన్నపేట మండలం నర్సాపురానికి చెందిన కాటూరి కళావతి, తిరువూరు మండలం చిట్టేలకు చెందిన కొండా వినోద్‌కుమార్‌లను అరెస్టు చేసి తహసీల్దార్ల ఎదుట బైండోవర్ చేశామని ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్ తెలిపారు. ఎ.కొండూరు మండలం గొల్లమండల తండాలో సారా బట్టీపై దాడి చేసి 300 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసి తయారీదారు భూక్యా పతియపై కేసు నమోదు చేశామన్నారు. వుత్రేల, అమ్మిరెడ్డిగూడెం గ్రామాల్లో నవోదయం కార్యక్రమంలో భాగంగా సారా నిర్మూలనపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.

సాగర్ నీటి సరఫరాను కొనసాగించాలి



మధిరబ్రాంచి కాలువలో సాగర్ జలాల సరఫరా పరిశీలిస్తున్న వీరబాబు, గోపాలకృష్ణ తదితరులు

తిరువూరు: దాళ్వా పంటల సంరక్షణకు సాగునీరు అత్యవసరమైనందున నాగార్జున సాగర్ ఎడమ కాలువల ద్వారా మరో వారం రోజుల పాటు రెండో జోన్‌కు నీరందించాలని నాగార్జున సాగర్ ఎడమ కాలువల ప్రాజెక్టు కమిటీ చైర్మన్ కోట వీరబాబు, సాగునీటి వినియోగదారుల సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు ఆళ్ల గోపాల కృష్ణ తెలంగాణ ప్రభుత్వాన్ని కోరారు. శనివారం తిరువూరు మండలం ముష్టికుంట్ల, వావిలాల గ్రామాల్లో సాగర్ నీటి సరఫరా తీరును వారు పరిశీలించారు. సాగునీటిని పొదుపుగా వాడుకోవాలని రైతులకు సూచించారు. ఎన్ఎస్‌పీ డీఈ రామదాసు, ఏఈ సునీత, డిస్ట్రిబ్యూటరీ కమిటీల చైర్మన్లు, సాగునీటి సంఘాల అధ్యక్షులు పాల్గొన్నారు.

కంప్యూటర్లు, ప్రింటర్ అందజేత



జక్కంపూడి సచివాలయంలో కంప్యూటర్లు పరిశీలిస్తున్న ఇన్‌చార్జి ఎంపీడీఓ కృష్ణప్రసాద్

విజయవాడరూరల్: జక్కంపూడి గ్రామ సచివాలయానికి కంప్యూటర్లు, ప్రింటర్, టేబుల్స్ వచ్చేశాయి. గత సెప్టెంబర్ నెలలో వచ్చిన బుడమేరు వరదల్లో గ్రామ సచివాలయం ముంపునకు గురైంది. వరదల్లో రెండు కంప్యూటర్లు, ప్రింటర్, టేబుల్స్ పూర్తిగా తడిసి పాడైపోవడంతో సిబ్బంది ఇబ్బందులు పడ్డారు. కంప్యూటర్స్ లేకపోవడంతో ప్రతి రోజూ జరగాల్సిన పౌర సేవలు స్తంభించాయి. జక్కంపూడి, షాబాదు గ్రామాల ప్రజలు అనేక అవస్థలు పడ్డారు. సిబ్బంది సొంత కంప్యూటర్ ఏర్పాటు చేసుకుని అత్యవసర పనులు నిర్వహించారు. ఇన్‌చార్జి ఎంపీడీఓ పి.మురళీకృష్ణప్రసాద్ సమస్యను గ్రామ, వార్డు సచివాలయాల కార్యాలయంలో తెలియచేయడంతో డైరెక్టర్ ఎం. శివప్రసాద్ శనివారం రెండు కంప్యూటర్లు, ఒక ప్రింటర్‌ను పంపారు. వేరే గ్రామ సచివాలయాల్లో ఖాళీగా ఉంటున్న 6 టేబుళ్లు, కుర్చీలను ఏర్పాటు చేశారు. గ్రామ సచివాలయ కార్యాలయం సిబ్బందితో ఇన్‌చార్జి ఎంపీడీఓ మురళీకృష్ణప్రసాద్ సమావేశం నిర్వహించి, ప్రభుత్వ సర్వేలను త్వరితగతిన పూర్తి చేయాలని చెప్పారు.

జల్‌జీవన్ మిషన్ పనులు పూర్తి చేయండి

ఎంపీడీఓ సునీత శర్మ



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ సునీత శర్మ

ఇబ్రహీంపట్నం: జల్‌జీవన్ మిషన్‌లో భాగంగా గ్రామాల్లో నిర్దేశించిన తాగునీటి పైప్‌లైన్ పనులను త్వరగా పూర్తిచేయాలని ఎంపీడీఓ సునీత శర్మ పేర్కొన్నారు. ఆస్పిరేషనల్ బ్లాక్స్ ప్రోగ్రాం కింద కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న జల్‌జీవన్ మిషన్ పనులపై స్థానిక ఎంపీపీ కార్యాలయంలో ఎంపీపీ పాలడుగు జోత్స్న అధ్యక్షతన వివిధ శాఖల అధికారులు, సర్పంచులకు సమీక్ష సమావేశం శనివారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ ఆదేశాల మేరకు జల్‌జీవన్ మిషన్ పనులు పూర్తి చేసేందుకు జిల్లా పరిషత్, మండల, గ్రామ స్థాయిలో నిధులు సమీకరించాలన్నారు. నిధులు సమీకరణ చేసి పైప్‌లైన్లు, ట్యాపులు ఏర్పాటు చేసి వేసవిలో ప్రజల తాగునీటి అవసరాలు తీర్చాలని సూచించారు. సర్పంచులు, అధికారులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి సహకరించండి



మాట్లాడుతున్న ఎంపీపీ ఇస్లావత్ ప్రసన్నరాణి

మైలవరం: మైలవరం మండలంలో గ్రామాల అభివృద్ధికి స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు సహకరించాలని ఎంపీపీ ఇస్లావత్ ప్రసన్న రాణిస్వామి అన్నారు. మైలవరం మండల పరిషత్ సర్వసభ్య సాధారణ సమావేశం శనివారం ఎంపీడీఓ అనూరాధ అధ్యక్షతన జరిగింది. ఎంపీపీ ఇస్లావత్ ప్రసన్నరాణిస్వామి మాట్లాడుతూ ఎండలు ముదురుతున్నందున తాగునీటికి కొరత లేకుండా గ్రామాల్లో చర్యలు తీసుకోవాలన్నారు. పదో తరగతి పరీక్షలు జరుగుతున్న నేపథ్యంలో విద్యార్థులు ఇబ్బందులు పడకుండా విద్యుత్‌కు అంతరాయం లేకుండా చూడాలని విద్యుత్ శాఖ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, పంచాయతీల కార్యదర్శులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

నీటిని పొదుపుగా వాడుకోవాలి



చాట్రాయి: నీటిని సంరక్షించుకుందాం అని తుమ్మగూడెం ఉర్దూ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వరరావు అన్నారు. శనివారం ఆయన స్థానిక పాఠశాలలో నిర్వహించిన సేవ్ ఎర్త్, సేవ్ వాటర్, సేవ్ ఫ్యూచర్ కార్యక్రమంలో మాట్లాడారు. నీరు లేకుంటే సమస్త ప్రపంచం నిర్జీవంగా మారుతుందన్నారు. ప్రతి నీటి బొట్టుని పొదుపుగా వినియోగించుకోవాలని ఆయన సూచించారు.


బోరుపంపునకు మరమ్మతులు చేయాలని వినతి



కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి నేతాజీ నగర్‌లో బోరుపంపునకు మరమ్మతులు చేయాలని మున్సిపల్ ఏఈ మాస్కికి సీఐటీయూ ఆధ్వర్యంలో స్థానికులు శనివారం వినతిపత్రం అందజేశారు. సీఐటీయు పట్టణ కార్యదర్శి ఎం.మహేష్ మాట్లాడుతూ నేతాజీనగర్‌లో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందన్నారు. సకాలంలో తాగునీరు రాక, ఉన్న బోరు పంపు పనిచేయక నీటిఎద్దడి తలెత్తి ప్రజలు ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. సకాలంలో తాగునీరు అందించి బోరుపంపు రిపేర్ చేయాలని కోరారు. స్థానికులు ఎ.లక్ష్మి, తిరుపతమ్మ, మరియమ్మ పాల్గొన్నారు.


సంక్షిప్త సమాచారం

రైతు సేవా కేంద్రంలో గోనె సంచుల పరిశీలన



ముసునూరు: చింతలవల్లిలోని మారుతీ ట్రేడర్స్ రైస్ మిల్లు వద్ద అందుబాటులో ఉన్న గోనె సంచులను తహసీల్దార్ కె.రాజ్‌కుమార్ శనివారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ 30 వేల సంచుల్లో గ్రేడింగ్ చేసిన తర్వాత 29 వేల గోనె సంచులు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. రబీ సీజన్ ఆరంభమైన దృష్ట్యా రైతు సేవా కేంద్రంలో ఉన్న గోనె సంచులు కూడా పరిశీలించగా, 1,300 గోనె సంచులు పాడైపోయినట్లు గుర్తించామన్నారు. అనంతరం అక్కిరెడ్డిగూడెంలో జరుగుతున్న రీ–సర్వే ప్రక్రియను, ముసునూరు గ్రామంలోని రేషన్ డీలర్ల వద్ద జరుగుతున్న ఈకేవైసీ నమోదు సరళిని తనిఖీ చేశారు. ఉన్నతాధికారులకు నివేదిక పంపనున్నట్లు చెప్పారు.

నిమ్రాలో జాతీయ సాంకేతిక సదస్సు



జూపూడి(ఇబ్రహీంపట్నం): స్థానిక నిమ్రా కళాశాలలో పదో జాతీయ స్థాయి సాంకేతిక సదస్సు శనివారం ఘనంగా జరిగింది. ఈ సదస్సుకు ముఖ్యఅతిథిగా వ్యవహరించిన కృష్ణా యూనివర్సిటీ డైరెక్టర్ ఆర్.కిరణ్‌కుమార్ సమకాలీన సాంకేతిక పరిశోధనల ద్వారా నూతన ఆవిష్కరణలు రూపొందించడంపై అవగాహన కల్పించారు. విద్యార్థుల ఆవిష్కరణల ప్రదర్శనకు సాంకేతిక సదస్సు వేదికగా నిలిచింది. ఈ సదస్సులో పోస్టర్ ప్రదర్శన, పేపర్ ప్రజెంటేషన్, ప్రాజెక్ట్ ఎక్స్‌పో, టెక్నికల్ క్విజ్ తదితర పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అక్బర్‌ఖాన్ ప్రారంభించిన ఈ సదస్సులో అకడమిక్ డైరెక్టర్ టి.నారాయణమూర్తి, డెప్యూటీ డైరెక్టర్ సయ్యద్ గులాంగౌస్, కన్వీనర్ సయ్యద్ సాదత్ ఆలీ, ప్రొఫెసర్ డాక్టర్ మిస్నీ తదితరులు పాల్గొన్నారు.

ఇంగ్లిష్ ఒలింపియాడ్‌లో విద్యార్థుల ప్రతిభ

మైలవరం: మైలవరం వివేకానంద ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో యూనిఫైడ్ కౌన్సిల్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన యూనిఫైడ్ ఇంటర్నేషనల్ ఇంగ్లిష్ ఒలింపియాడ్ 2024–25 పరీక్షల్లో వివేకానంద హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ చూపి జాతీయ స్థాయిలో 100లోపు ర్యాంకులు సాధించారని ప్రిన్సిపాల్ ఎంవీ శ్రీనివాసరావు తెలిపారు. ర్యాంకులు సాధించిన వారిలో తమ పాఠశాల విద్యార్థులు ఎం.లక్ష్మీప్రణీత, ఎస్ ప్రశాంతి (9వ తరగతి), టి. శివప్రసాద్, ఈ. అనువర్షిణి, కె.మధుశ్రీ, ఎం మధు, ఎ.ఉమా సాయికృష్ణ (8వ తరగతి), జి. సాత్విక, ఎం. శ్రీకిరణ్, వై. శరణ్య, వై.హర్షిత (7వ తరగతి), వి.జాస్మిత (6వ తరగతి), వి. సూర్యవర్ధన్‌రెడ్డి (5వ తరగతి), ఎ.ఆద్విక్ ప్రసూన్, బి. ప్రణతి (4వ తరగతి) ఉన్నారు. విద్యార్థులను స్కూల్ ప్రిన్సిపాల్ ఎంవీ శ్రీనివాసరావు, కరస్పాండెంట్ పి. రాజారెడ్డి తదితరులు అభినందించారు.

డ్రోన్ సాయంతో నిందితుల గుర్తింపు

తిరువూరు: తిరువూరు పోలీసు స్టేషను పరిధిలో పలు నేరాల్లో పాల్గొన్న నిందితుల గుర్తింపునకు పోలీసులు డ్రోన్ సహాయం తీసుకుంటున్నారు. శనివారం స్థానిక టౌన్‌షిప్ ఆవరణలో నివాస గృహాల సమీపంలో బహిరంగ మద్యపానం చేస్తూ స్థానికులకు ఇబ్బంది కలిగిస్తున్న ఇద్దరు యువకులను గుర్తించి వారిపై కేసులు నమోదు చేశామని ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు. గంజాయి సరఫరా చేస్తూ పలుమార్లు పట్టుబడి, పోలీసు రికార్డుల్లో నమోదైన నలుగురు యువకులను సైతం గుర్తించి పోలీసు స్టేషన్‌లో కౌనెలింగ్ ఇచ్చారు. తిరిగి గంజాయి అమ్మకాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ హెచ్చరించారు.

క్రెడిట్ సొసైటీలో సభ్యులుగా చేరాలి

తిరువూరు: ఏపీ బ్రాహ్మణ సహకార క్రెడిట్ సొసైటీలో సభ్యులుగా చేరి ఆర్థిక ప్రగతి సాధించాలని ఏపీ ప్రైవేటు అర్చక పురోహిత సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఈశ్వరప్రగడ విజయకుమార్ అన్నారు. గంపలగూడెం మండలం మేడూరులో గంపలగూడెం బ్రాహ్మణ పరిషత్, అర్చక పురోహిత బ్రాహ్మణ సంఘ సమావేశం శనివారం నిర్వహించారు. బ్రాహ్మణ క్రెడిట్ సొసైటీలో సభ్యత్వం చేరడం, రుణాలు పొందడం తదితర అంశాలను విజయకుమార్ వివరించారు. సొసైటీలో వివిధ పథకాల బ్రోచర్‌ను విడుదల చేశారు.

ఆర్థిక సహాయం



చాట్రాయి: అనారోగ్యంతో బాధపడుతున్న చిన్నంపేట గ్రామానికి చెందిన తీర్థాల నాగేశ్వరరావు శాస్త్రికి శనివారం నూజివీడు మానవత స్వచ్ఛంద సంస్థ ఆర్థిక సహాయం అందజేసింది. సంస్థ చైర్మన్ పి. కృష్ణప్రసాద్ ఆధ్వర్యంలో నగదు రూ.17,115, నాలుగు నెలలకు సరిపడా నిత్యావసర సరకులు అందజేశారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు కొండపల్లి అనంతలక్ష్మి, కార్యదర్శి మాచినేని రాజేంద్రప్రసాదు, సిద్ధార్థ హైస్కూల్ ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, సీపీఐ మండల కార్యదర్శి కొమ్మ ఆనందం తదితరులు పాల్గొన్నారు.